రంజాన్ వేళలు

	ఇఫ్తార్(శనివారం)	సహరీ(ఆదివారం)
కర్నూలు	6:36 (సాయంత్రం)	4:46 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:34 (సాయంత్రం)	4:58 (ఉదయం)
ఆదోని	6:38 (సాయంత్రం)	4:45 (ఉదయం)



వైసీపీలో కల్లోలం..!

- కర్నూలు వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్‌కు 'ఎస్వీ షాక్'
- ప్రచారంలో పాల్గొనేది లేదంటున్న ఎస్వీ వర్గీయులు
- కష్టపడినా గుర్తింపు లేదని ఆగ్రహం
- దీన్ని అదునుగా తీసుకున్న ఎమ్మెల్యే హఫీజ్ వర్గం
- 'ఆయన లేకపోతే గెలవలేమా..' అంటూ ప్రచారం
- ఎమ్మిగనూరులోనూ ఎమ్మెల్యే ఎర్రకోట వర్గీయుల అసంతృప్తి



కర్నూలు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ కోసం ఎంతో కష్టపడ్డాం.. టికెట్ ఇవ్వకపోయినా అవమానం దిగమింగుకొని అధిష్ఠానం పంపిన అభ్యర్థి గెలుపు కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్నాం. అయినా మా నాయకుడు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి వర్గాన్ని గుర్తించడం లేదు. మా శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరుగా మారింది. గుర్తింపు లేనప్పుడు మేముందుకు పని చేయాలి..? ప్రచారంలో ఎందుకు పాల్గొనాలి..? ఎలాంటి హోదాలు లేకుండా ఎన్నికల ప్రచారంలో పాల్గొనే ప్రసక్తే లేదు' అని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి వర్గీయులు తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ వర్గానికి ఇస్తున్న ప్రాధాన్యత తమకు ఇవ్వడం లేదని ఎస్వీ అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారి తిరుగుబాటుతో వైసీపీ అభ్యర్థి ఏఎం ఇంతియాజ్ అహ్మద్ ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. ఇదే అదనుగా ఎస్వీ వర్గం పొలిటికల్ బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతోందని... వారు పని చేయకపోయినా వైసీపీ విజయం ఖాయమని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ వర్గం అంతర్గతంగా ప్రచారం చేస్తోంది. ఎమ్మిగనూరులోనూ ఇదే పరిస్థితి ఉంది. వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని, గత నెల 29న జరిగిన 'మేమంతా సిద్ధం' సభలో సీఎం జగన్ గాని, అభ్యర్థి బుట్టా రేణుక గాని కనీసం ఎర్రకోట పేరును కూడా ఉచ్చరించలేదన్న ఆగ్రహంతో చెన్నకేశవరెడ్డి వర్గం రగిలిపోతోంది.

మేము ప్రచారంలో పాల్గొనలేం..!

వైసీపీ అధిష్ఠానం కూడా వ్యూహాత్మంగా ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ వర్గానికే ప్రాధాన్యత ఇస్తూ ఉద్దేశపూర్వంగానే మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆయన వర్గాన్ని రాజకీయంగా అణచివేస్తోంది. దీనికి తోడు 'ఎస్వీ మోహన్‌రెడ్డి వర్గం ప్రచారం చేసినా.. చేయకపోయినా గెలుస్తాం..' అంటూ హఫీజ్ ఖాన్ వర్గం పరోక్షంగా చేస్తున్న ప్రచారం వారిని మరింత అవమానానికి గురి చేస్తోంది. ఎమ్మెల్యే వర్గానికి చెందిన ఒకరిద్దరు నాయకులు 'ఆయన లేకపోతేనేం.. వైసీపీ గెలవదా.. మేము ఇంతియాజ్‌ను గెలిపించుకోలేమా..' అంటూ అనుచరుల వద్ద జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాడో పేడో తేల్చుకోవడానికి ఎస్వీ వర్గం సిద్ధమైనట్లు తెలుస్తోంది. శుక్రవారం వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్ తన నివాసంలో ఎస్వీ వర్గీయులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తీవ్ర ఆగ్రహంతో ఎస్వీ వర్గం రగిలిపోయినట్లు తెలుస్తుంది. 'మా నాయకుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆయన ఆదేశాల మేరకు మేము ఎలాంటి పదవి ఆశించకుండా ఐదేళ్లు పార్టీ కోసం పని చేశాం. అధిష్ఠానం మిమ్మల్ని అభ్యర్థిగా ప్రకటించగానే పార్టీ నిర్ణయానికి కట్టుబడి ప్రచారం చేశాం. ఏ పదవి అడగకపోయినా మా నాయకుడు ఎస్వీ మోహన్ రెడ్డికి వైసీపీ జిల్లా అధ్యక్ష పదవి ఇస్తామని సంకేతాలు ఇచ్చారు. ఇప్పుడు పదవి ఇవ్వకపోగా ప్రత్యర్థి వర్గానికే చెందిన సత్యనారాయణమ్మకే మేయర్‌తో పాటు పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఎలా ఇస్తారు..? మా నాయకుడు ఏ హోదా లేకుండా ఏమని ఓట్లు అడగాలి..? రాజకీయ కుట్రలో భాగమే అణచివేస్తున్నారు..' అంటూ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ ఎదుట ఆక్రోశం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి ఎన్నికల తరువాత ఎస్వీ మోహన్‌రెడ్డికి సముచిత స్థానం కల్పిస్తామని ఇంతియాజ్ హామీ ఇచ్చారు. 2019 ఎన్నికల సమయం కూడా ఆనాటి అభ్యర్థి హఫీజ్‌ఖాన్ ఇలాంటి మాటలే చెప్పి గెలిచాక మోసం చేశాడని ఎస్వీ వర్గీయులు దీటుగా సమాధానమిచ్చారు.

కష్టపడినా గుర్తింపు లేదా..?



కర్నూలు వైసీపీ టికెట్ కోసం ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ సహా మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీబీ చైర్ పర్సన్ ఎస్వీ విజయమనోహరి దంపతులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. 2019 ఎన్నికల్లో హఫీజ్‌ఖాన్ గెలుపు కోసం అప్పటి ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి గట్టిగా కృషి చేశారు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ గెలిచాక ఎస్వీ వర్గాన్ని పూర్తిగా పక్కన పెడుతూ వచ్చారు. దీంతో వారిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా విభేదాలు తలెత్తాయి. దీంతో ఇద్దరికి కాకుండా కృష్ణా జిల్లా కలెక్టరుగా పని చేసిన ఐఏఎస్ అధికారి ఏఎం ఇంతియాజ్ అహ్మద్‌తో రాజీనామా చేయించిన సీఎం జగన్ కర్నూలు వైసీపీ అభ్యర్థిగా బరిలో దింపారు. ఆ సమయంలో టికెట్ ఆశించిన ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు రాజ్యసభ సీటు ఇస్తానని, మాజీ ఎస్వీ మోహన్‌రెడ్డికి వైసీపీ జిల్లా అధ్యక్ష పదవి ఇస్తామని ఆ పార్టీ అధిష్ఠానం హామీ ఇచ్చింది. దీంతో ఇద్దరు కూడా ఇంతియాజ్‌తో కలసి ప్రచారం చేపట్టారు. మార్చి 29న ఎమ్మిగనూరులో జరిగిన 'మేమంతా సిద్ధం' సభలో హఫీజ్‌ఖాన్‌కు టికెట్ ఇవ్వలేకపోయానని, మన ప్రభుత్వం వచ్చాక రెండేళ్లలో వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో రాజ్యసభకు పంపుతానని సీఎం జగన్ ప్రకటించారు. అదే క్రమంలో ఎస్వీ మోహన్‌రెడ్డిని వైసీపీ జిల్లా అధ్యక్షుడిని చేస్తానని జగన్ ప్రకటిస్తారని ఆయన వర్గీయులు ఆశించారు. అయితే ఆ సభలో జగన్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆ రోజే ఎస్వీ మోహన్ రెడ్డి, ఆయన వర్గీలు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. జిల్లా అధ్యక్ష పదవిపై ఆశలు పెట్టుకున్న ఎస్వీ మోహన్ రెడ్డికి ఆశాభంగం ఎదురైంది. జిల్లా అధ్యక్షురాలిగా కార్పొరేటర్ సత్యనారాయణమ్మను ఎంపిక చేస్తూ వైసీపీ అధిష్ఠానం గురువారం ప్రకటన విడుదల చేసింది. పార్టీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఎస్వీ వర్గం జీర్ణించుకోలేక పోతోంది. హఫీజ్‌ఖాన్ వర్గానికి చెందిన కార్పొరేటర్ సత్యనారాయణమ్మ ఆ పార్టీ నగర అధ్యక్షురాలిగా ఉన్నారు. అదేవిధంగా మేయర్‌గా కూడా ఎంపిక చేశారు. ఈ రెండుపదవులకు తోడు తాజాగా జిల్లా అధ్యక్ష పదవి కూడా ఆమెకే కేటాయించడంతో వైసీపీలో ఎస్వీ మోహన్ రెడ్డికి ఉన్న ప్రాధాన్యం పేకమేడలా ఒక్కసారిగా కూలిపోయింది. పార్టీలో వరుస పరాభవాలతో ఎస్వీ అనుచరులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.



వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్ అహ్మద్

ఎమ్మిగనూరులో 'ఎర్రకోట'కు బీటలు



ఎమ్మెల్యే ఎర్రకోట



బుట్టా రేణుక

ఎమ్మిగనూరు వైసీపీలోనూ ముసలం తారస్థాయికి చేరింది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకల మధ్య అంతర్గత విభేదాలు పొడచూపినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే ఎర్రకోట, ఆయన తనయుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి ప్రమేయం లేకుండానే బుట్టా రేణుక, ఆమె తనయుడు బుట్టా ప్రతుల్ ప్రచారంలో పాల్గొంటున్నారు. వివిధ గ్రామాలకు చెందిన వారిని పార్టీలో చేర్చుకోవడం ఎర్రకోట వర్గీయులకు ఏమాత్రం మింగుడు పడటం లేదు. ఎమ్మెల్యే ఎర్రకోట కుటుంబ టికెట్ త్యాగం చేయడంతో ఎన్నికల తరువాత ఎర్రకోట తనయుడు జగన్మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చినట్లు సమాచారం. అందువల్లే ఎమ్మెల్యే ఎర్రకోట బుట్టా రేణుక అభ్యర్థిత్వాన్ని అంగీకరించారని రాజీకయంగా చర్చ జరుగుతోంది. గతనెల 29న ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ మైదానంలో జరిగిన 'మేమంతా సిద్ధం' సభ వేదికపై ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఉన్నా.. సీఎం జగన్ గాని, అభ్యర్థి బుట్టా రేణుక ప్రసంగం సమయంలో ఎమ్మెల్యే ఎర్రకోట పేరును కనీసం కూడా ఉచ్చరించకపోవడం ఆయన వర్గీయుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. అదే వేదికపై నుంచి కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు టికెట్ ఇవ్వలేదని, రెండేళ్ల తరువాత రాజ్యసభ ఎంపీగా చేస్తానని సీఎం జగన్ ప్రకటించారు. అదే సమయంలో ఎమ్మిగనూరు టికెట్ ఎమ్మెల్యే ఎర్రకోట, ఆయన కుమారుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డికి ఇవ్వలేకపోయాను.. జగన్మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీని చేస్తానని జగన్ ప్రకటిస్తారని ఎర్రకోట వర్గీయులు ఆశించారు. ఓ వైపు జగన్ పట్టించుకోకపోవడం.. మరో వైపు అభ్యర్థి బుట్టా రేణుక ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఎర్రకోట వర్గీయులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్

కలెక్టర్ జి.సృజన



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 5: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డా.బాబు జగ్జీవన్‌రామ్ అని కలెక్టర్ డా.జి.సృజన అన్నారు. శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా నగరంలోని ఆర్ఎస్ రోడ్డు కూడలిలో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ కేంద్ర మంత్రిగా పని చేసిన సమయంలో అట్టడుగు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని అన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని భావితరాలకు మార్గదర్శకులుగా ఉండాలని కోరారు. బాబు జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి కుటుంబంలోని పిల్లలను బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి, సెట్కూరు సీఈవో రమణ, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుదేశం బీసీల పార్టీ

- భారీ మెజార్టీతో గెలవబోతున్నాం
- ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు



నాగరాజు, టీజీ భరత్‌లను సత్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 5: ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీని బీసీలు సొంతం చేసుకున్నారని ఆ పార్టీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి కురువ నాగరాజు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కర్నూలు ఎంపీ సహా అన్ని ఎమ్మెల్యే స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. శుక్రవారం నగరంలోని మౌర్యఇన్‌లో నిర్వహించిన బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో కర్నూలు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి టీజీ భరత్‌తో కలిసి నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు పెద్ద పీట వేసే పార్టీ ఒక్క తెలుగుదేశం మాత్రమేనన్నారు. టీడీపీ ప్రభుత్వంలో బీసీలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారన్నారు. అయితే అత్యధిక జనాభా కలిగిన బీసీ కులస్థుల్లో ప్రస్తుతం ఐక్యత కొరవడుతోందన్నారు. బీసీలు గ్రామాల్లో ఉన్నంత ఐకమత్యంగా పట్టణాల్లో ఉండలేకపోతున్నారన్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న వైసీపీ నాయకులు బీసీల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. టీజీ భరత్ మాట్లాడుతూ జగన్ పాలనలో బడుగులకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు బీసీలకు అందకుండా చేసిన కుట్రపూరిత నైజం జగన్‌ది అన్నారు. అందుకే బీసీలందరూ ఐక్యంగా ఉండి ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అర్షద్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొద్ది రోజులు ఓపిక పట్టండి

- రాక్షస పాలనను అంతం చేస్తాం
- 'నిజం గెలవాలి' సభలో నారా భువనేశ్వరి



నంద్యాలలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

నంద్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మరి కొద్ది రోజులు ఓపిక పడితే రాక్షస పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి లభిస్తుందని నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నంద్యాల జిల్లా మహానంది మండలం బుక్కాపురంలో పర్యటించారు. చంద్రబాబు అక్రమంగా అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన చిన్న మద్దిలేటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నంద్యాల పట్టణంలోని వెంకటాచలం కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త గాజుల అబ్దుల్ రహీమ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకొని వారిలో ధైర్యాన్ని నింపారు. అలాగే 13వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త గురువరాజు కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా బండిఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామంలో కందుకూరి నరసింహాచారి, కసినేని వెంకటేశ్వర్లు గౌడ్ కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ అండంగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. మహానంది మండలం బుక్కాపురం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నారా భువనేశ్వరి ప్రసంగించారు. సంక్షేమం పేరుతో సీఎం జగన్ రాష్ట్రాన్ని దివాళా తీయించారని విమర్శించారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో గంజాయి, కల్తీ మద్యం, ఇసుక అక్రమ రవాణాతో రూ.కోట్లు సంపాదించారని ఆరోపించారు. ఎంతో మంది టీడీపీ కార్యకర్తలను దారుణంగా హత్య చేయించారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని అంతం మొందించి, టీడీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్, ఏపి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ నాయకుడు తాతిరెడ్డి తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నారా భువనేశ్వరిని చూసేందుకు వచ్చిన మహిళలు



నారాయణపురంలో కందుకూరి నరసింహాచారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి



బుక్కాపురంలో చిన్నమద్దిలేటి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న నారా భువనేశ్వరి



అబ్దుల్ రహీం కుటుంబ సభ్యులతో భువనేశ్వరి



గురువరాజు కుటుంబాన్ని ఓదార్చుతున్న భువనేశ్వరి



ఫొటోలో కనిపిస్తున్న ఈ రైతు పేరు కే మహేష్, గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామం. 2021 ఖరీఫ్ సీజన్‌లో తనకున్న ఐదెకరాల పొలంలో పత్తి సాగు చేశాడు. కొత్త బస్టాండు సమీపంలో ఓ దుకాణంలో డీలరు వద్ద కావేరి కంపెనీకి చెందిన జాదూ రకం పత్తి విత్తనాలను కొనుగోలు చేశాడు. పత్తి సాగు కోసం దాదాపు రూ.లక్షకు పైగా ఖర్చు చేశాడు. పంట చేతికందే సమయంలో పత్తి కాయలు పూర్తిగా రాలిపోయాయి. పక్వానికి వచ్చిన కాయలు కూడా నేలపై రాలిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొన్నారు. పంటను వ్యవసాయాధికారులకు చూపించాడు. వ్యవసాయాధికారి శాంపుల్స్‌ను తీసుకుని ప్రయోగశాలకు పంపాడు. ఈ రైతు మాదిరిగానే దాదాపు ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగు వేల మంది రైతులు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కావేరి కంపెనీకి చెందిన జాదూ రకం విత్తనాలనే వాడారు. పంట దిగుబడి ఏ మాత్రం లేకపోవడంతో రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని రైతులంతా ఆయా జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ ఎదుట భారీ ఎత్తున ఆందోళనలకు దిగారు. దీంతో ప్రభుత్వ ఆదేశాలపై కర్నూలు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, అదేవిధంగా నంద్యాల వ్యవసాయ శాఖ జేడీ మోహన్‌రావు నివేదికల ఆధారంగా నంద్యాల, వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని శాస్త్రవేత్తలు గూడూరు, కల్లూరు తదితర మండలాల్లో పత్తి పంటను పరిశీలించి నాసిరకం విత్తనాల వల్లే దిగుబడి తగ్గిపోయినట్లు నిర్ధారించారు. అదేవిధంగా గుంటూరులోని లాంఫాం పరిశోధన కేంద్రానికి చెందిన ప్రధాన శాస్త్రవేత్తలు కూడా ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించి పత్తి పొలాలను పరిశీలించి శాంపుల్స్ తీసుకువెళ్లి ప్రయోగశాలల్లో పరిశీలించారు. వారి పరిశీలనలో నాసిరకం విత్తనాలు వినియోగించడం వల్లనే పంట దెబ్బతిందని నిర్ధారించారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, కర్నూలు, పాణ్యం, నందికొట్కూరు తదితర నియోజకవర్గాల్లోని దాదాపు పది వేల మంది రైతులకు పైగానే కావేరి కంపెనీకి చెందిన జాదూ రకం పత్తి విత్తనాలను వాడారు. అయితే.. అధికారుల ప్రభుత్వానికి పంపిన నివేదిక ప్రకారం రైతుల నుంచి సేకరించిన రశీదులను పరిశీలించి 1800 మంది రైతులు మాత్రమే తొమ్మిది వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారని పేర్కొన్నారు. శాస్త్రవేత్తల నివేదికను అనుసరించి 2021లోనే కర్నూలు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు వ్యవసాయ శాఖ చెందిన వివిధ నియోజకవర్గాల జేడీలు రైతులను పిలిపించుకుని ఎంత మొత్తంలో పరిహారం అందించాలో చర్చించారు. ఎకరాకు మూడు క్వింటాళ్ల దిగుబడిని ప్రాతిపదికగా తీసుకుని 13 వేలకు పరిహారాన్ని అందించేలా నిర్ణయించారు 1800 మంది రైతులకు సంబంధించి ఎనిమిది వేల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతినడం వల్ల సంబంధిత పొలాల రైతులకు రూ.17 కోట్లు చెల్లించాలని కావేరి కంపెనీ యాజమాన్యానికి అధికారుల కమిటీ ఉత్తర్వులను జారీ చేసింది. అయితే..

2021 ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లా రైతులు సాగు చేసిన పత్తి పంట విస్తీర్ణం (హెక్టార్లలో)

సబ్ డివిజన్	విస్తీర్ణం
కర్నూలు	33,845
డోన్	14,445
నందికొట్కూరు	10,931
ఆత్మకూరు	2,373
నంద్యాల	3,318
ఆళ్లగడ్డ	983
కోయిలకుంట్ల	1,764
ఆదోని	62,346
ఎమ్మిగనూరు	50,224
ఆలూరు	49,053
పత్తికొండ	21,091

కమిషనర్‌దే తుది నిర్ణయం



2021 ఖరీఫ్‌లో పత్తి పంట నష్టపోయిన రైతులకు దాదాపు రూ.17 కోట్లు పరిహారం అందించాల్సి ఉంది. తుది నిర్ణయం వ్యవసాయ శాఖ కమిషనర్ తీసుకోవాల్సి ఉంది. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఈ విషయంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు పరిహారాన్ని అందిస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు..

- వరలక్ష్మి, జేడీఏ



ఇది జాదూ ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 5:

రైతులను నట్టేట ముంచిన 'జాదూ' పత్తి రకం విత్తన కంపెనీకే ప్రభుత్వం వత్తాసు పలుకుతోంది. 2021లో పత్తి రైతులకు తీవ్రంగా నష్టపోయినా పరిహారం ఇప్పించడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 1800 మంది రైతులు మాత్రమే తొమ్మిది వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. అయితే వీరంతా జాదూ రకం కంపెనీ విత్తనాలనే వాడారు. ఇవి నాసిరకం కావడంతో దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారు. దీంతో రైతులు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో స్పందించిన ప్రభుత్వం అధికారులతో విత్తనాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు శాస్త్రవేత్తలు, పంటలను జాదూ నాసిరకం విత్తనాల వల్లే పంట నష్టం జరిగిందని తేల్చి చెప్పారు. దీంతో అధికారుల కమిటీ ప్రభుత్వం 1800 మంది రైతులకు రూ.17 కోట్లు చెల్లించాలని కావేరి కంపెనీ యాజమాన్యాన్ని ఆదేశించింది. అయితే నాలుగేళ్లవుతున్నా రైతులకు మాత్రం పరిహారం అందించలేదు. దీంతో రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు వ్యవసాయ శాఖ కమిషనర్ నిర్లక్ష్యం వల్లే ఇలా జరుగుతోందని మండిపడుతున్నారు.

జిల్లా అధికారుల కమిటీ ఉత్తర్వులను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా కావేరి కంపెనీ యజమానులు హైకోర్టుకు వెళ్లారు. వాతావరణ పరిస్థితుల వల్లనే పత్తి పంట దెబ్బతిందని, విత్తనాల ప్రభావం ఏమీ లేదని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు హైకోర్టు స్పందించి శాస్త్రవేత్తలతోపాటు అధికారుల కమిటీ నివేదికలను పరిశీలించాలని వ్యవసాయ శాఖ కమిషనర్‌ను ఆదేశించింది. నకిలీ విత్తనాలను తేలితే వెంటనే పరిహారాన్ని అందించాలని ఆదేశాలు ఇచ్చింది.

రెండేళ్లుగా కమిషనర్ వద్దే పరిహారం ఫైళ్లు

రైతులు పత్తి పంట సాగు కోసం రూ.లక్షలాది రూపాయలు అధిక వడ్డీలకు అప్పులు చేశారు. కావేరి కంపెనీ నాసిరకం విత్తనాలను అంటగట్టడం వల్లనే దిగుబడి తగ్గి తాము నష్టపోయామని, వెంటనే పరిహారం అందించాలని వారు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. అయితే.. వ్యవసాయ శాఖ కమిషనర్ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు రైతులకు పరిహారం అందలేదు. 2021 ఖరీఫ్‌లో జరిగిన పంట నష్టానికి కారణమైన కావేరి కంపెనీ యాజమాన్యం నుంచి రూ.17 కోట్ల పరిహారాన్ని ఇప్పించడంలో ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడంపై ఉమ్మడి జిల్లా రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పైగా కావేరి కంపెనీకే వత్తాసు పలుకుతూ దాదాపు మూడేళ్లు కాలయాపన చేయడంపై రైతు సంఘాల ప్రతినిధులు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలోనైనా రైతులపై కనికరం చూపి నష్టపోయిన రైతులకు జిల్లా అధికారులు నిర్ధారించిన మేరకు పరిహారాన్ని అందజేయాలని, లేకపోతే ఎన్నికల్లో రైతుల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరిస్తున్నారు.

జిల్లా మొత్తం సాగైన విస్తీర్ణం 2,50,374

ప్రస్తుతం ఈ పంట మొత్తం కాలం చెల్లిన నాసిరకం పత్తి విత్తనాలను వాడడంతో పాటు వర్షాభావ పరిస్థితుల వల్ల తెగుళ్ల కారణంగా దిగుబడి పూర్తిగా తగ్గిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి



- రైతులకు పరిహారం ఇప్పించకుండా కంపెనీకే వత్తాసు
- 2021లో నష్టం జరిగితే నేటికీ అందని వైనం
- జాదూ రకం విత్తనాల వల్లే పంట రాలేదని నిర్ధారణ
- రూ.17 కోట్ల చెల్లింపునకు అధికారుల కమిటీ ఆదేశం
- వ్యవసాయ శాఖ కమిషనర్ నిర్లక్ష్యంతో రైతుకు దక్కని ఊరట

కఠిన చర్యలు తీసుకోవాల్సిందే



కర్నూలు జిల్లా నాసిరకం, కాలం చెల్లిన విత్తనాల తయారీకి కర్నూలు అడ్డాగా మారింది. ప్రతి ఏటా రైతులకు జరుగుతున్న నష్టాన్ని వ్యవసాయాధికారులు నివారించే చర్యలు చేపట్టడం లేదు. జిల్లా కేంద్రంలోనే ఈ విత్తనాల విక్రయాలు జోరుగా జరుగుతున్నా పట్టించుకునే వారే లేరు. గూడూరు మండలంలో నాసిరకం పత్తి విత్తనాలు, అలాగే మరి కొన్ని నియోజకవర్గాల్లో మొక్కజొన్న, మిరప తదితర నాసిరకం విత్తనాలను వాడి రైతులు నష్టపోయారు. వ్యవసాయాధికారులకు ఆయా విత్తన కంపెనీల యాజమాన్యాలు, డీలర్ల నుంచి భారీగా మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న వ్యవసాయాధికారులపై ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. విజిలెన్స్ అధికారులు అడపాదడపా తనిఖీలు చేపడుతున్నా నాసిరకం విత్తనాల వాడకం జిల్లాలో తగ్గడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సంబంధిత వ్యవసాయాధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కంపెనీ యజమానులు డీలర్లతో సత్సంబంధాలు ఉన్న వ్యవసాయాధికారులను బదిలీ చేస్తే తప్ప రైతులకు న్యాయం జరిగే అవకాశం కనిపించడం లేదు.

- రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

మహానందిలో ఉప లోకాయుక్త అధికారి

మహానందీశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఉప లోకాయుక్త రజనీ దంపతులకు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ అధికారులు

మహానంది, ఏప్రిల్ 5: మహానంది శైవ క్షేత్రంలో రాష్ట్ర ఉప లోకాయుక్త అధికారి పి.రజనీ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా హాజరైన ఆమెకు ఆలయ ముఖ మండపం వద్ద అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో ఉపలోకాయుక్త అభిషేకార్చనలు నిర్వహించారు. అలంకార మండపంలో వేదపండితులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. వీరి వెంట ఏఈఓ ఎర్రమల్ల మధు, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు. అదేవిధంగా కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా న్యాయాధికారి శ్రీనివాసరావు దంపతులు శుక్రవారం మహానందీశ్వరుడు, కామేశ్వరిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో నారా భువనేశ్వరి



మహానంది ఆలయంలో స్వామివారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

మహానంది, ఏప్రిల్ 5: నంద్యాల జిల్లాలోని మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయం వద్ద టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరుడికి అభిషేకం, కామేశ్వరిదేవి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలను నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలోని అలంకార మండపంలో వేదపండితులు నారా భువనేశ్వరని సత్కరించి స్వామివారి ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మహానందిలోని అద్భుత జలసంపద, ఆలయ చరిత్ర గురించి వేదపండితులు రవిశంకర్ అవధాని వివరించారు. భువనేశ్వరి వెంట మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, శైలజ దంపతులు, టీడీపీ నాయకులు తాతిరెడ్డి తులసిరెడ్డి, మహానంది ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ పాణ్యం ప్రసాదరావు, మండల కన్వీనర్ మధు, నూరే శ్రీనివాసులు, ఘని, చిన్నరంగ స్వామి, ఉమాదేవి, టీకే సరోజమ్మ తదితరుల ఉన్నారు.

ఎల్లెల్సీలో జారిపడి వ్యక్తి మృతి

హాలహర్వి, ఏప్రిల్ 5: మండల కేంద్రమైన హాలహర్వి గ్రామానికి చెందిన సోమశేఖర్ (32) ఎల్లెల్సీ కాలువలో పడి మృతి చెందాడు. శుక్రవారం హొళగుందలో ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు వెళ్లిన సోమశేఖర్ దాహం వేయడంతో పక్కనే ఉన్న ఎల్లెల్సీ కాలువ ఒడ్డుకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు ఆయన కాలుజారి కాలువలో పడి గల్లంతయ్యాడు. అనంతరం హొళగుంద కాలువలో సోమశేఖర్ శవాన్ని పోలీసులు గుర్తించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మోదీవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 5: ప్రధాని మోదీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానోకోవాలని, లేకుంటే ప్రజలే రాజకీయ సమాధి కడతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ అన్నారు. శుక్రవారం పత్తికొండ పట్టణంలో సీపీఐ ఎన్నికల సన్నాహక సమావేశం స్థానిక సీఆర్ భవనం ఆవరణలో జరిగింది. ముఖ్యఅతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, కర్నూలు పార్లమెంటు అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్, పత్తికొండ సీపీఐ అసెంబ్లీ అభ్యర్థి రామ చంద్రయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ మాట్లాడుతూ ఏపీలో చంద్రబాబును జైలుకు పంపించిన ఘనత మోదీదే అన్నారు. ఏ నేరం చేయకపోయినా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను జైలులో పెట్టించారని అన్నారు. వేల కోట్ల మైనింగ్ మాఫియాకు పాల్పడిన గాలి జనార్దన్ రెడ్డి బీజేపీలో చేరితే.. నీతి మంతుడైపోతాడా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీఎం జగన్ రెడ్డి అరాచక పాలన సాగిస్తూ వ్యవస్థలను గుప్పిట్లో ఉంచుకుని నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. పింఛన్ల పంపిణీలో సీఎం జగన్ రాజకీయ డ్రామాలు మానుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ

కార్యక్రమంలో శేఖర్, రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బబు, జిల్లా నాయకులు జగన్నాథం, నబీ రసూల్; రామక్రిష్ణారెడ్డి, రంగన్న, కారన్న, ఈరన్న, కాంగ్రెస్, సీపీఎం నాయకులు శ్రీనివాసరెడ్డి, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నాటక రంగ ఖ్యాతిని చాటి చెప్పాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 5: జిల్లా నాటక రంగ ఖ్యాతిని దశదిశలా చాటి చెప్పాల్సిన బాధ్యత కళాకారులపై ఉందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని మౌర్యఇన్‌లో గల టీజీ వెంకటేశ్ కార్యాలయంలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన నందిని నాటకోత్సవాల్లో 8 నందిని అవార్డులు సాధించిన టీజీవీ కళాక్షేత్రం కళాకారులు కలిశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ నాటక దర్శకుడు, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యతోపాటు అవార్డులు సాధించిన కళాకారులు మహ్మద్ మియా, జీవీ శ్రీనివాసరెడ్డి, సామ్యూల్, శివయ్య, కే బాల వెంకటేశ్వర్లు, రాముడు, సంగా ఆంజనేయులు, పి. రాజారత్నం, గాండ్ల లక్ష్మణ తదితరులను శాలువా కప్పి సత్కరించారు. అనంతరం టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ పత్తి ఓబులయ్య దర్శకత్వంలో కళాకారులు ప్రదర్శించిన 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' పౌరాణిక పద్య నాటకానికి ఎనిమిది నందిని అవార్డులు రావడం కళాకారుల కృషికి నిదర్శనమని ప్రశంసించారు.



కళాకారులను అభినందిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

హత్య కేసులో రెండో నిందితుడి అరెస్ట్

- లుక్ అవుట్ నోటీసుల జారీ చేసిన ఎస్పీ
- న్యూ ఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్‌లో పట్టుకున్న పోలీసులు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 5 : హత్య కేసులో రెండో నిందితుడిని అరెస్ట్ చేయడంలో నంద్యాల రెండో పట్టణ పోలీసుల శ్రమ ఫలించింది. ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి లుక్ అవుట్ నోటీసులు జారీ చేయడంతో నిందితుడు దేశం వదిలి వెళ్లకుండా అరెస్ట్ చేయగలిగారు. సీఐ కె.రాజారెడ్డి శుక్రవారం ఆ వివరాలను వెల్లడించారు. 2017లో నంద్యాల రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని టెక్కె ప్రాంతానికి చెందిన గంగు ఆనంద్‌కుమార్ అలియాస్ ఆనంద్ అలియాస్ సుబ్బరాయుడు అనే వ్యక్తి తాను నంద్యాల పెద్ద చర్చి డయాసిస్ సెక్రటరీనని ఎయిడెడ్ టీచర్ల ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి కొందరిని నమ్మించాడు. అతడి మాటలు నమ్మిన తిరుపతి ఎంఆర్‌పల్లికి చెందిన కొప్పల సురేంద్ర, అరవ సోమశేఖరరెడ్డి, మరో 30మంది నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశాడు. అయితే నంద్యాల డయాసిస్‌లో ఎలాంటి ఉద్యోగాలు లేవని తెలుసుకున్న బాధితులు తాము కట్టిన డబ్బులు తిరిగి చెల్లించాలని గంగు ఆనంద్‌పై ఒత్తిడి తెచ్చారు. గంగు ఆనంద్ డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో 11.11.2019న కొప్పల సురేంద్ర, సోమశేఖర్‌రెడ్డి ఇంకా కొంత మంది కలిసి నంద్యాల టెక్కెలోని గంగు ఆనంద్ ఇంటి వద్దకు వెళ్లి డబ్బులు అడిగారు. డబ్బులు ఎగ్గొట్టాలనే ఉద్దేశంతో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం గంగు ఆనంద్, అతడి భార్య యోగేశ్వరి, వారి కుమారుడు గంగు యువరాజ్‌లు కలిసి వారిపై దాడి చేశారు. కత్తులతో పొడవడంతో వారిద్దరికి గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ అరవ సోమశేఖర్‌రెడ్డి మృతి చెందాడు. దీంతో రెండో పట్టణ పోలీసులు నిందితులపై క్రైం నెం.199/2019గా హత్య కేసు నమోదు చేశారు. ఈ కేసులో మొదటి నిందితుడు గంగు ఆనంద్ కుమార్, మూడో నిందితురాలు గంగు యోగేశ్వరిలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రెండో నిందితుడైన గంగు యువరాజ్ పోలీసులకు దొరక్కుండా తప్పించుకొని తిరుగుతుండేవాడు. అయితే యువరాజ్ పాస్‌పోర్ట్ నెంబరు తెలుసుకొని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి అన్ని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లకు లుక్ అవుట్ నోటీసులు పంపి నిందితుడు దేశం నుండి తప్పించుకొని వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఇదేమీ తెలియని నిందితుడు యువరాజ్ కజకిస్థాన్ వెళ్లాలనే ఉద్దేశంతో న్యూ ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. పరిశీలనలో ఎయిర్‌పోర్ట్ ఇమ్మిగ్రేషన్ అధికారులు కనిపెట్టి ఆ సమాచారాన్ని నంద్యాల ఎస్పీకి చేరవేశారు. వెంటనే ఎస్పీ రఘువీర్‌రెడ్డి నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల టూ టౌన్ సీఐ కె.రాజారెడ్డి, ఏఎస్సై బి.జఫ్రుల్లాఖాన్, కానిస్టేబుల్ పి.క్రైలాస్‌లను బృందంగా నియమించి పంపారు. ఆ బృందం న్యూ ఢిల్లీ చేరుకొని గంగు యువరాజ్‌ను అదుపులోకుంది. నంద్యాలకు తీసుకువచ్చి శుక్రవారం నంద్యాల జేఎఫ్‌సీఎం ఎదుట హాజరు పరచగా నిందితుడికి రిమాండ్ విధించారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో చొరవచూపిన నంద్యాల టూ టౌన్ సీఐ రాజారెడ్డి, ఏఎస్సై బి.జఫ్రుల్లాఖాన్, కానిస్టేబుల్ పి.క్రైలాస్‌లను ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డిలు అభినందించారు.



నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

ఈ నెల చివరిలోగా ఈక్రాప్ నమోదు పూర్తి చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 5: రైతులు సాగు చేసిన పంటల ఈక్రాప్ నమోదు ఈ నెలాఖరుకు పూర్తవుతుందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వేసవి సీజన్‌లో సాగు చేసిన పంటలను నమోదు చేసేందుకు ఈ నెల 3వ తేదీన మొబైల్ అప్లికేషన్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. వర్షాల ఆధారంగా పంటలు సాగు చేసే అవకాశం లేదని, బావులు, బోర్లు, చెరువుల కింద కూరగాయలు, ఆరుతడి పంటలు రైతులు సాగు చేస్తారని, ఈ పంటలను రైతులు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారో ఈక్రాప్‌లో నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు జేడీ వరలక్ష్మి తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



బి.తాండ్రపాడులో ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 5: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కోడుమూరు పార్టీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు గ్రామంలో శుక్రవారం రెండో రోజు ఎస్సీ కాలనీలో బొగ్గుల దస్తగిరి స్థానిక సర్పంచు ఆకెపోగు జయన్నతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్ళి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామ శివారులో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల పట్టాలకు సంబంధించిన ప్లాట్లను వారికే కేటాయించే విధంగా చూస్తామని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు శ్రీనివాసులు, ఎంపీటీసీ మద్దిలేటి, మాజీ ఎంపీటీసీ మాధన్న, ఉప సర్పంచు చాంద్‌బాషా, తెలుగు యువత అధ్యక్షుడు పేరపోగు రాజు, రాముడు, మోహన్, వనుములయ్య, ఎల్లకృష్ణ, యేసురత్నం, విజేయుడు, మనోహర్ పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనను అంతం చేద్దాం

సి.బెళగల్, ఏప్రిల్ 5: వైసీపీ అరాచక పాలనను అంతం చేద్దామని మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోలకల్లు బీసీ కాలనీలో టీడీపీ నాయకులు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ టీడీపీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎర్రమల, సోమేశ్వరి, లింగమ్మ, కళ్యాణి పాల్గొన్నారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

సి.బెళగల్, ఏప్రిల్ 5: మండలంలోని గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈసందర్భంగా ఎంపీడీవో శకుంతల మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పింఛన్ల కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేశామన్నారు. సచివాలయ సిబ్బంది పింఛన్‌దారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా పింఛన్లు పంపిణీ చేయడంతో వారిని ఆమె అభినందించారు.

ఉద్యోగాలకు పలువురి ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ అధికారి

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 5: నగర శివారు దూపాడులోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శుక్రవారం చెన్నైకి చెందిన మెడికల్ కోడింగ్ కంపెనీ 'ఒమేగా హెల్త్‌కేర్ సంస్థ వారు కళాశాల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించారు. కంపెనీ హెచ్‌ఆర్‌లు దారుస్, విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులను ఎంపిక చేశారు. మొదటి రౌండ్‌లో రాత పరీక్ష, రెండో రౌండ్‌లో సాంకేతిక పరిజ్ఞానంపై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో బి.ఫార్మసీ నుంచి 48 మంది, ఫార్మా-డి నుంచి 24 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కె.విజయలక్ష్మి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు. కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రమణ, ప్లేస్‌మెంట్ అధికారి నిజాముద్దీన్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 5: నగరంలోని సి.క్యాంపు ప్రార్థన మందిరం వద్ద దివంగత గుంతాల లక్ష్మణస్వామి, శేషమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. శుక్రవారం సీఐడీ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, సీఐ పవన్‌కిషోర్ ముఖ్యఅతిథులుగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రామ్మూర్తి, చర్చి పాస్టర్ కరుణసాగర్, సంఘ పెద్దలు భాస్కర్, ప్రవీణ్, శౌరి, భరణి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 5: దోమల నివారణ చర్యలు చేపట్టాలని, వారంలో ప్రతి శుక్రవారం డ్రైడేగా ప్రజలు పాటించాలని డీఎంహెచ్‌వో డా.వై.ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కర్నూలు బుధవారపేటలోని మెడిరీయన్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో జరుగుతున్న డ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. దోమలతో డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్ గున్యా, మెదడువాపు వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని హెచ్చరించారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు విసర్జించే లార్వా 8 నుంచి 10 రోజులలోపు దోమగా మారుతుందని, వారంలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ఇళ్ల చుట్టూ పక్కల ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఇళ్ల పరిసరాలలో పాత కూలర్లు, కొబ్బరి చిప్పలు లేకుండా చూసుకోవాలన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు టీజీ భరత్, గౌరు వెంకటరెడ్డి

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 5: బాబు జగ్జీవన్‌రామ్ 117 జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జడ్పీ మినీ సమావేశ భవనంలో ఆయన చిత్రపటానికి జడ్పీ సీఈవో నాసరరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి సరస్వతి, మహ్మద్ హక్, ఉమాదేవి, సుమయ, జేమ్స్, కిషోర్, క్రిష్టారావు, మనోహర్, రాములమ్మ పాల్గొన్నారు.

● నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎ.భార్గవతేజ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ చుండీప్రసాద్ పాల్గొన్నారు.

● బాబు జగ్జీవన్‌రామ్ జీవితం అందరికీ ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. శుక్రవారం బుధవారపేట భవానమ్మ ఆలయం ఎదుట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శివర్గసభ్యుడు కే.రామక్రిష్ణ, కృష్ణ, రమేష్, చంద్ర, రామాంజనే యులు పాలొన్నారు.

● బాబు జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో సామాజిక హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిద్దామని ఏపీ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. కేవీపీఎస్, డప్పుకళాకారులు, కాటి కాపరుల సంఘాల ఆధ్వర్యంలో ఆర్ఎస్ కూడలిలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎన్‌జి.కృష్ణ, విజయమ్మ, భాస్కర్, గురుస్వామి పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): దేశ చరిత్ర పటంలో చెరగని ముద్ర వేసుకున్న మహనీయుల జీవిత చరిత్ర నేటి తరానికి తెలియజెప్పాల్సిన బాధ్యత



జిల్లా పరిషత్‌లో..

ప్రతి ఒక్కరిపై ఉందని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం ఐదు రోడ్ల కూడలిలోని జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహానికి ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● పేదల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ అని డీసీసీ కే.బాబు రావు అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యా ల యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిం చారు. అంతకముందు ఐదు రోడ్ల కూడలిలోని జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్ర హానికి నివాళి అర్పించారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప, దామో దరం రాధాకృష్ణ, ఉండవల్లి వెంకటన్న, బీ.బతుకన్న, బీ.ఆంజనేయులు, అనంతరత్నం, ప్రమీల, వెంకట సుజాత పాల్గొన్నారు.

ఆర్‌యూలో : రాయలసీమ యూనివర్సిటీలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఉపకులపతి బీ. సుధీర్ ప్రేమ్ కుమార్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డీన్‌లు వెంకటసుందరా నంద పుచ్చా, సీవీ కృష్ణారెడ్డి, ఆర్.భరత్ కుమార్, ప్రిన్సిపాల్ వై. హరి ప్రసాద్‌రెడ్డి, పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కల్లూరు: నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కర్నూలు నగరంలో మాధవనగర్‌లోని గౌరు స్వగృహంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి గౌరు వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ సంఘ సంస్కర్త, భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ అందరికీ ఆదర్శనీయుడని కొనియాడారు. బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పాల కొలను సుధాకర్‌రెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, అయ్యపురెడ్డి, శ్రీరాములు, అయ్యస్వామి పాల్గొన్నారు.

కర్నూలు(కల్చరల్): బడుగు, బలహీన వర్గాలకు స్ఫూర్తి ప్రదాతగా బాబు జగ్జీవన్‌రామ్ నిలిచిపోయారని టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పి.హనుమంతరావు చౌదరి కొనియాడారు. శుక్రవారం రైల్వే స్టేషన్ రోడ్డు ఐదు రోడ్ల కూడలిలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ధరూర్ జేమ్స్, కల్లూరు మండల మాజీ అధ్యక్షుడు బాలవెంకటేశ్వరరెడ్డి, రెడ్డిపోగు బజారి, బీసన్న, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ముస్లింలకు న్యాయం: టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 5: టీడీపీతోనే ముస్లింలకు న్యాయం జరుగుతుందని, బీజేపీతో పొత్తులో ఉన్నప్పుడే ముస్లింలకు పథకాలు అమలు చేశామని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని బుధవారపేటలో 14, 15, 16 వార్డుల ముస్లింలకు నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ఐదేళ్ల పాలనలో కర్నూలు ప్రజల తాగునీటి కొరతను తీర్చేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఫలితంగా ఇప్పుడు ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ, బీజేపీ పొత్తు ఉన్నప్పటికి ముస్లింలకు రంజాన్ తోఫా, యువతుల వివాహానికి దుల్హన్ పథకం అమలు చేశామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జకియా అక్ సారి, విజయకుమారి, టీడీపీ నాయకులు అబ్బాస్, రామాంజనేయులు, బాబ్జీ, జనసేన నాయకురాలు రేఖ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు అభివృద్ధికి కృషి చేస్తా: కర్నూలు అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని 16వ వార్డు బుధవారపేటలో టీజీ భరత్ భరోసా యాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారం చేపట్టబోతుందన్నారు. ఈ ఐదేళ్లలో అన్ని ధరలు పెరిగిపోయాయి ప్రజలపై భారం పడిందన్నారు. మళ్లీ రాష్ట్రం గాడిలో పడాలంటే టీడీపీ ప్రభుత్వం రావాల్సిందేనన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయకుమారి, మాజీ కార్పొరేటర్ రామాజంనేయులు, అబ్బాస్, బాబ్జీ, జనసేన రాయలసీమ ఎన్నికల కన్వీనరు పవన్, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. అనంతరం వైసీపీని వీడి యువకులు రంగ, ఓబులేష్, రాజు తదితరులు టీడీపీలో చేరారు.



మాట్లాడుతున్న టీజీ భరత్

కల్లూరు అర్బన్‌లో వైసీపీకి షాక్

గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిక



గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన పందిపాడు వైసీపీ నాయకులు

కల్లూరు, ఏప్రిల్ 5: పాణ్యం నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. కల్లూరు అర్బన్ 28 వార్డులో వైసీపీ ముఖ్య నాయకులు టీడీపీలో చేరారు. శుక్రవారం పందిపాడులోని బీఆర్‌రెడ్డి కాలనీకి చెందిన వైసీపీ నాయకులు జయ మోహన్ రెడ్డి, రమణమ్మ, వసంతి, వెంకటేశ్వరమ్మతోపాటు 70 కుటుంబాలు పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్ చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి గౌరు దంపతులు ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో శ్రీనివాసులు, రవి, అనిల్, భాను, సురేష్, శంకర్, ఎల్ల రాజు, శేఖర్, శేషమ్మ, వెన్నెల, సుచిత్ర ఉన్నారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ ఆకెపోగు వెంకటస్వామి, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, జె.గంగాధర్‌గౌడ్, కల్లూరు మాజీ సింగిల్‌విండో చైర్మన్ ఎన్వీ. రామకృష్ణ, శేఖర్‌చౌదరి, అయ్యపురెడ్డి, శంకర్‌రెడ్డి, కాసాని మహేష్‌గౌడ్, శ్రీరాములు పాల్గొన్నారు.

టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే అభివృద్ధి: టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 34వ వార్డు నిర్మల్‌నగర్‌లో ఆమె శంఖారావంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని మేనిఫేస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ వైసీపీపై విసుగు చెందిన ప్రజలు టీడీపీ కూటమికి పట్టం కట్టనున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కోశాధికారి పీయూ మాదన్న, లోకేష్‌గౌడ్, బీసన్న, దిలీప్, భాస్కర్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, నవీన్, శివ, తులసి, జె.గంగాధ ర్‌గౌడ్, నాగరాజు, సోమన్న. కె.ధనుంజయ, చిన్న బీచుపల్లి, టైలర్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించిన జగన్ : బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 5: కేంద్ర నిధులు తనవిగా చెప్పుకొని గత ఐదేళ్ల కాలం ప్రజలను సీఎం జగన్‌రెడ్డి మోసం చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 89 లక్షల రేషన్ కార్డులకు సరుకులను కేంద్రం ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తున్నట్లు జగన్ ప్రచారం చేసుకుంటున్నారన్నారు. 8 రకాల సరుకుల సరఫరా చేస్తుండగా పేదలకు కేవలం బియ్యాన్నే సరఫరా చేస్తున్నారని తెలిపారు. కేంద్ర పథకం జల్‌జీవన్ ద్వారా గత టీడీపీ ప్రభుత్వం హయంలో పంచాయతీ రాజ్ మంత్రిగా ఉన్న నారా లోకేష్ నిధులు తెచ్చి వందల కొద్ది ట్రాక్టర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయించారన్నారు. చంద్రబాబు హయంలో సంక్షేమ పథకాలకు బడ్జెట్ లో 19 శాతం నిధులు ఖర్చు చేస్తే జగన్ హయంలో కేవలం 15 శాతం మాత్రమే సున్నా వడ్డీ కింద రూ. 5 లక్షల వరకు రుణం అందిస్తే జగన్‌రెడ్డి 3 లక్షలకు కుదించారన్నారు. అన్న క్యాంటిన్లు రద్దు చేయడంతోపాటు రైతు రుణ మాఫీ అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, చంద్రన్న బీమా, పండుగ కానుకలు, వాటిని ప్రజలకు దూరం చేశారని ఆయన తెలిపారు. కోడి కత్తి డ్రామా, బాబాయి హత్యలో తాడే పల్లి కుట్రల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి పింఛన్లపై కుట్ర చేశారని బీటీ నాయుడు మండిపడ్డారు.

చంద్రబాబును గెలిపించుకుందాం: సోమిశెట్టి



కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 5: ఆర్యవైశ్యులంతా కలిసి చంద్రబాబును గెలిపించుకుందామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆర్య వైశ్యులపై కక్ష సాధిం పులకు పూనుకున్నారని మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో ఏనాడు ఆర్యవై శ్యులకు ఇబ్బంది కలిగించ లేదని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆర్యవైశ్య లంతా టీడీపీకి మద్దతు తెలపాలని కోరారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి



ప్రజలతో మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

ఓర్వకల్లు, ఏప్రిల్ 5: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం మండలంలోని మీదివేముల గ్రామంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ టీడీపీ నాయకుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో పూలమాలలతో ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆమె శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీదివే ముల గ్రామంలో జరిగిన అవినీతిపై అధికారంలోకి రాగానే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని ఆమె ఆరోపించారు. వైసీపీ రాక్షస పాల నలో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పింఛన్ల పంపిణీకి డబ్బులు లేకనే టీడీపీపై వైసీపీ నాయకులు బురద జల్లడం సిగ్గు చేటని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే రూ.4వేల పింఛన్‌ను ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, లక్ష్మన్న, బుగ్గ రాముడు, గోవిందు, నవీన్, రాజు, వెంకటేశ్వర్లు, గిడ్డయ్య, శ్రీనివా సరెడ్డి, మధు మోహన్ రెడ్డి, శ్రీరాములు, శివ, తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణలో పాల్గొనండి

కర్నూలు(స్పోర్ట్స్), ఏప్రిల్ 5: విద్యార్థులు వేసవి సెలవుల్లో క్రీడా శిక్షణలో పాల్గొని ఆరోగ్యాన్ని పెంచుకోవాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజనేయులు సూచించారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు క్రీడలను ప్రాక్టీసు చేసి రాణించాలని కోరారు. తల్లిదండ్రులు క్రీడా మైదానం వైపు పిల్లలను మళ్లించాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధిక ఉష్ణోగ్రత నమోదవుతున్నందున క్రీడల సాధనకు దూరంగా ఉండాలని కోరారు.

ఘనంగా ఆలయ శిఖర ప్రతిష్ఠ

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 5: మండలంలోని బైనదొడ్డి గ్రామంలో సుంకులమ్మ ఆలయ శిఖర ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి ఇటీవల శిఖరం నిర్మించారు. దీంతో వేడుకను జరిపించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. ఉదయం పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శిఖరంపై కలశ ప్రతిష్ఠగావించారు. గ్రామస్థులు ఆలయంలో అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



పూజలందుకున్న అమ్మవారు

టీడీపీలో చేరిన సి.బెళగల్ వైసీపీ నాయకులు

కర్నూలు (రూరల్), ఏప్రిల్ 5: సి.బెళగల్ మండలానికి చెందిన (వాల్మీకి యూత్) 70మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సి.బెళగల్ మండల టీడీపీ నాయకులు ధనుంజయుడు, బీమన్న ఆధ్వర్యంలో కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి విష్ణు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో రామనాయుడు, సురేష్, నల్లారెడ్డి, శేఖర్, రఘునాథ్, వెంకటేష్, సిద్దు, మునిస్వామి, వీరస్వామి, ఉపేంద్ర, చిరంజీవి ఉన్నారు.

● కోడుమూరు నియోజవర్గ పరిధిలో ఉన్న కర్నూలు బాలాజీనగర్ సమీపంలోని బంజార కాలనీ, మమతానగర్‌కు చెందిన మధు ఆధ్వర్యంలో దాదాపు 50మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి విష్ణు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో ఈరన్నగౌడ్, లవన్‌గౌడ్, సాయి, ఆది, శ్రీధర్, ముని, అనిల్‌గౌడ్, గణేష్, శ్యామ్, మహేష్, షఫీ ఉన్నారు.



టీడీపీలో చేరిన వారితో విష్ణువర్ధన్‌రెడ్డి

విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూడాలి



డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న మీసాల సుమలత

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 5: విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, రోజుకు మూడు సార్లు వాటర్ బెల్ కొట్టేలా చూడాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక కర్నూలు నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో మధుసూదన్‌రావుకు ఆమె వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఏప్రిల్, మే మాసాల్లో 45 డిగ్రీల ఎండలు నమోదు కానుండటంతో డీహైడ్రేషన్‌కు విద్యార్థులు గురికాకుండా రోజుకు మూడుసార్లు తాగునీరు తాగేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చూడాలన్నారు. ప్రతి రోజు 8.45 గంటలకు, 10.05 గటలకు, 11.50 గంటలకు వాటర్ బెల్ కొట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రంగబాబు, షంషద్దీన్, షాలుమియా, ముంతాజ్, మహబూబ్‌బీ, జాకీర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త మృతి

ఓర్వకల్లు, ఏప్రిల్ 5: ఓర్వకల్లు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త భట్టు లక్ష్మన్న (75) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి లక్ష్మన్న మృతదేహా నికి పూలమాలలు వేసి సంతాపాన్ని తెలిపారు. లక్ష్మన్న టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేశారన్నారు. వీరి వెంట నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, స్వామిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, అల్లాబాబు, అబ్దుల్లా, నాగరాజు, బత్తుల వెంకటరమణ ఉన్నారు.

కల్లూరు అర్బన్‌లో నేడు నిజం గెలవాలి యాత్ర

కల్లూరు, ఏప్రిల్ 5: పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్ 37వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలో టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. శనివారం నంద్యాల జిల్లా నుంచి కర్నూలు చేరుకుని మధ్యాహ్నం 12.40 గంటలకు నారా భువనేశ్వరి బాధితుడి మారెన్న ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చుతారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనస్తాపానికి గురై గుండె పోటుతో ప్రాణాలు కోల్పోయిన బోయ మారెన్న కుటుంబాన్ని పరామర్శిస్తారు.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి

గూడూరు, ఏప్రిల్ 5: వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు అన్నారు. శుక్రవారం గూడూరులో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్ళి బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటి కింద సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. తెలుగుదేశం పార్టీకి వస్తున్న ప్రజాదరణ చూస్తుంటే టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. చంద్రబాబు నాయుడు సీఎం కావడం తథ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గౌండ కుమార్, విజయ్ కుమార్, నడిపన్న, భాస్కర్, సిద్దార్థ, యుగేంద్ర సింగ్, మధు, చందు, విష్ణు సేన అభిమానులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, ఏప్రిల్ 5: నగరంలోని బళ్ళారి రోడ్ సెక్షన్ 132 కేవీ లైన్ల మరమ్మతు పనుల్లో భాగంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం డి1, డి2 సబ్ డివిజన్‌లో ఉదయం 9 గంటలకు నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈలు రాజేంద్రబాబు, రాజమోహన్‌రెడ్డి తెలిపారు. క్రిష్ణానగర్, న్యూక్రిష్ణానగర్, మయూరి హోమ్స్, తారాకరామ కాలనీ, విఠల్‌నగర్, సంతోష్‌నగర్, పవర్‌హౌస్ సెక్షన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

9న ఉగాది కవి సమ్మేళనం

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 5: జాతీయ సాహిత్య పరిషత్తు కర్నూలు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 9న క్రోధి నామ సంవత్సర 'ఉగాది కవిసమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎండీపీఎస్ రామశర్మ, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 'మన పండుగలు - భారతీయత' అనే అంశంపై ఈ కవి సమ్మే ళనం ఉంటుందని, 9న సాయంత్రం 5 గంటలకు నగరంలోని విద్యా నగర్‌లోగల మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో జరిగే ఈ కవి సమ్మేళనంలో కవులు, రచయితలు, తెలుగు భాషా సాహిత్యాభి మానులు పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

గాజులదిన్నె ప్రాజెక్టులో 1.7 టీఎంసీల నీరు

గోనెగండ్ల, ఏప్రిల్ 5: ఈ వేసవిలో గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఉన్న తాగునీటి పథకాలకు నీటి సమస్య లేదని జీడీపీ ఇరిగేషన్ అధికారి మహమ్మద్ ఆలీ శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం జీడీపీలో నీటి మట్టం 1.7(గ్రాస్), (1.1లైవ్)టీఎంసీల నీరు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి

స్వాతంత్ర్య సమరయోధుడు, దళిత హక్కుల పరిరక్షకుడు, భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్‌కు రాజకీయ పార్టీల నాయకులు, దళిత, ప్రజాసంఘాల, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘన నివాళి అర్పించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆయన జయంతిని ఘనంగా నిర్వహించి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. పేదలు, శ్రామికుల సామాజిక, ఆర్థిక సమానత్వ సాధన కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. భారతదేశం తీవ్ర కరువు, కాటకాలతో అల్లాడుతున్నప్పుడు హరిత విప్లవానికి నాంది పలికిన మహనీయుడని, ఆయన చొరవతోనే నేడు ఆహార ధాన్యాలు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామని ఆయన కీర్తిని చాటుతూ నివాళి అర్పించారు.


ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఆదోని టౌన్, ఏప్రిల్ 5: డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్, కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఎండీ నూర్ అహమ్మద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మొదటి దళిత ఉప ప్రధానిగా పనిచేసిన ఆయన పేదలందరికీ చౌక ధరలతో ఆహార పదార్థాలు అందజేయాలన్న ఉద్దేశంతో చౌక దుకాణాలను ఏర్పాటు చేసిన ఘనత ఆయనదేనని కొనియాడారు. యువజన కాంగ్రెస్ నాయకుడు తాయన్న, మైనారిటీ పట్టణ అధ్యక్షుడు మెహబూబ్ రఫీ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ జయంతిని నిర్వహించారు. నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. నాయకులు సుందరరాజు, కొండయ్య చౌదరి, రామకృష్ణ నాయుడు, కలీముల్లా, ఉసేన్ పాల్గొన్నారు.

అలాగే పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అలాగే ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ భవనసాధన కమిటి అధ్యక్షుడు కదిరికోట ఆదేన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే కోర్టు ఆవరణలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు గురురాజారావు ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు.

మంత్రాలయం : నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్, జైభీమ్ ఎమ్మార్పీఎస్ వేర్వేరు సమయాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అమ్రేష్, చార్లెస్, ప్రసన్న కుమార్, అబ్రహం, కేవీపీఎష్ నాయకులు అంజి, రవి, దేవపుత్ర, జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కిం జానయ్య పాల్గొన్నారు.

నందవరం: స్థానిక తహసీల్దారు, ఎంపీడీవో, సచివాలయ కార్యాలయాల్లో జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల ఆయన చేసిన సేవలు గురించి కొనియాడారు. కార్యక్రమంలో మునెప్ప, లక్ష్మీపండు, కొండన్న, చిన్నఈరన్న,లక్ష్మీకాంత్, బజారి, శ్రీరాములు, మల్లయ్య, పాపన్న, సోమన్న పాల్గొన్నారు.

ఆదోని (అగ్రికల్చర్): ఎస్టీయూ ఆధ్వర్యంలో బాబుజగ్జీవన్ రామ్ చిత్రపటానికి రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్ప, జిల్లా కార్యదర్శి గోపాల్, సీనియర్ నాయకులు సూర్యుడు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, రామాంజనేయులు పూలమాలవేసి నివాళి అర్పించారు.

అలాగే బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిమ్మారెడ్డి బస్టాండ్ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జిల్లా అధ్యక్షుడు భాస్కర్ పూలమాలవేసి నివాళి అర్పించారు.

ఆలూరు : స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల గాధిలింగ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు.

అలాగే మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ రాఘవరావు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేశారు. రాష్ట్ర నాయకులు నాగరాజు , వైస్ ప్రిన్సిపాల్ వీరేష్ పాల్గొన్నారు.

తుగ్గలి : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సుధాకర్ రెడ్డి, సిబ్బందిజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పత్తికొండటౌన్: స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి రాష్ట్ర నాయకులు రామకొండ వెంకటేశ్వర్లు మాదిగ, జిల్లా నాయకులు పులికొండ మాదిగ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

మద్దికెర : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో, ఎస్సీ కాలనీలో జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ రజాక్‌వలి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలు అర్పించారు.

పెద్దకడుబూరు : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యువరాజు, ఉపాధ్యాక్షుడు సతీష్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు

గోనెగండ్ల : స్థానిక బస్టాండ్ ప్రాంగనంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. డప్పుకళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మాయమాటలు నమ్మొద్దు

● మంత్రాలయం టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 5: రాష్ట్రంలో జగన్ అరాచక పాలన సాగుతోందని, ఆయన మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని టీడీపీ టీడీపీ మంత్రాలయం అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. జనసేన నియోకవర్గ ఇన్‌చార్జి, ఐక్యవాల్మీకి పోరాట కమిటి, బీసీ సెల్ రాయలసీమ కన్వీనర్ బి.లక్ష్మన్న, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్‌తో కలిసి రాఘవేంద్రరెడ్డి తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనసేన, టీడీపీ, బీజేపీ ఐక్యంగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, జగన్ వల్ల రాష్ట్రానికి అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు ప్రజల్లో నమ్మకం వచ్చిందని, టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, బొజ్జప్ప, రోగెప్ప, భీమిరెడ్డి, కేశన్న, హుశేనీ పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన కుంటనహల్ గ్రామస్థులు, ఇస్త్రీ చేస్తూ వినూత్నంగా ప్రచారం చేస్తున్న రాఘవేంద్ర రెడ్డి

బాలనాగిరెడ్డికి రాజకీయ భిక్ష పెట్టిందే టీడీపీ

కౌతాళం, ఏప్రిల్ 5: మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి రాజకీయ భిక్ష పెట్టిందే టీడీపీ అని అలాంటిది ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబుపై పోటీకి సిద్ధమని బాలనాగిరెడ్డి అనడం సిగ్గుచేటని మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. స్థానిక ఉప్పరగేరి, రెడ్డిస్‌కాలనీ, మెయిన్ బజార్, వైఎస్సార్ నగర్, ఎన్టీఆర్ నగర్‌లో ఇంటింటి ప్రచారంలో భాగంగా పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాయకులు సురేష్‌నాయుడు, సతీష్ నాయుడు, జనసేనా నాయకుడు రామాంజనేయులు, బీజేపీ నాయకుడు ఈరన్న ఉన్నారు.

కుంటనహాల్‌లో 50 కుటుంబాలు టీడీపీలో చేరిక

వైసీపీలో తమకు తగిన ప్రాధాన్యం లేకపోవడంతో కుంటనహల్ గ్రామానికి చెందిన 50 కుటుంబాలు హజీ, దర్గా మౌలా ఆధ్వర్యంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఉలిగయ్య, టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీ పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు.

అధికారంలోకి వచ్చేది తెలుగుదేశమే : వీరభద్రగౌడ్

చిప్పగిరి, ఏప్రిల్ 5: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేపట్టేది తెలుగుదేశం పార్టీయేనని ఆ పార్టీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్ అన్నారు. శుక్రవారం నేమకల్లు గ్రామంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీకి అనుకూల పవనాలు వీస్తున్నాయని, అనేక సర్వేలు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయఢంకా మోగించి 140 స్థానాలు సాధించడం ఖాయమని వీరభద్ర గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.మీనాక్షినాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు మోహన్, రజిని, తిమ్మయ్య, కిష్టప్ప, రవి, షేక్షావలి, వెంకటేష్, సురేష్, పురుషోత్తం, రామాంజనేయులు, కొండా గోవిందు, మిరపకాయల చంద్ర, ఖాజీపురం ఓబయ్య, హంపయ్య, పులికొండ, నాగరాజు, నరసింహులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన నేమకల్లు వైసీపీ కుటుంబాలు, మాట్లాడుతున్న వీరభద్రగౌడ్

మణేకుర్తిలో టీడీపీ ప్రదర్శన

ఆలూరు : ఆలూరు మండలం మణేకుర్తి గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర నాయకులు మణేకుర్తి రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రగౌడ్‌ను కలిసి సన్మానించారు. టీడీపీ సీనియర్ నేత కమ్మరచేడు మద్దిలేటి, లింగన్న, మనేకుర్తి వైస్ సర్పంచ్ చిన్న రంగన్న, అల్లప్ప, మధు, దాదావలి, నాగేష్, దేవేంద్ర, బంగి దేవేంద్ర, కిరీటప్ప, లక్ష్మీకాంత్, చంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపుతాం

రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమితో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపుతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్, జనసేన నాయకులు చత్రపతి, శేకర్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు, ఇసుక మాఫియా, మద్యం సరఫరాతో కోట్లాది రుపాయలు దండుకున్నారాన్నారని విమర్శించారు. ఆలూరు ఉమ్మడి అభ్యరి వీరభద్ర గౌడ్‌ను గెలిపించాలని కోరారు. జనసేన నాయకులు యశోద, బీజేపీ తాలూకా అధ్యక్షుడు వెంకటరాముడు, టీడీపీ నాయకులు సుధాకర్, సాలి సాహెబ్ పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారంటీ : కేఈ

క్రిష్ణగిరి, ఏప్రిల్ : రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు చంద్రబాబు నాయుడు గ్యారంటీ అని టీడీపీ పత్తికొండ అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. లాల్‌మాన్‌పల్లె, చిట్యాల గ్రామాల్లో టీడీపీ నాయకులతో కలిసి శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలకు తెలియజేశారు.. రాబోయే ఎన్నికల్లో టీడీపీ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మదర్ సాహెబ్, కాలా సాహెబ్, మోహన్ పాల్గొన్నారు.

శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం

మంత్రాలయం, ఏప్రిల్ 5 : రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్య పూజలకు విరామం కల్పించారు. శుక్రవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయకొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేశారు

నీటి సరఫరా కార్యాలయం ముట్టడి

నందవరం, ఏప్రిల్ 5: పొణకలదిన్నెలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు నీటి సరాఫరా కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకట్రాముడుకు వినతి పత్రం అందజేశారు. దాదాపు 15 రోజులుగా తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. గ్రామంలో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ మంచాల లక్ష్మీనారాయణ, ఎమ్మార్పీఎస్ జాల్లా అధ్యక్షుడు రామతీర్థం, అమరేష్‌మాదిగ పాల్గొన్నారు.

'హిందూ ధర్మపరిరక్షణకు ప్రత్యేక కృషి'

మంత్రాలయం, ఏప్రిల్ 5: హిందూ ధర్మపరిరక్షణకు శ్రీమఠం విశేష కృషి చేస్తోందని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. శుక్రవారం ప్రవచనా మండపంలో గురుసార్వభౌమ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కర్ణాటకలోని హాసన చిన్నరాయ పట్నానికి చెందిన లోకేశ్ దాసులు, బెంగుళూరు చెందిన జగదీష్, చందు హరికథామృత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికథామృతంతో భక్తులు ఆలపించి మంత్రముగ్ధులయ్యారు. వీరిని మఠం పీఠాధిపతి అభినందించి నగదు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో వాదిరాజరావు, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సౌకర్యాలపై నిర్లక్ష్యం వద్దు :ఆర్ఓ

మంత్రాలయం, ఏప్రిల్ 5: పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించొద్దని మంత్రాలయ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మురళి, అసిస్టెంట్ ఆర్వో శ్రీధర్‌మూర్తి అన్నారు. శుక్రవారం సూగూరు, బూదూరు గ్రామాల్లో పోలింగ్ బూత్ నెంబర్.61, 82లను తనిఖీ చేశారు. తాగునీరు విద్యుత్, ఫర్నీచర్, ఫ్యాన్లు, తదితర ఏర్పాట్లను పరిశీలించారు.

రాష్ట్రంలో వైసీపీ కనుమరుగు కావడం ఖాయం

కోసిగి, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ రాష్ట్రంలో కనుమరుగు కావడం ఖాయమని మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సోదరుడు ఎన్.రామక్రిష్ణారెడ్డి, కర్నూలు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి అన్నారు. శుక్రవారం వందగల్లు గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వందగల్లులో ఇంటింటికి వెళ్లి టీడీపీకి ఓట వేయాలని నియోజకవర్గ అభివృద్ధికి ఓటర్లే కంకణం కట్టుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆస్పరి, ఏప్రిల్ 5: మండలంలోని కారుమంచి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కిషోర్ (17) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తురవగల్లు గ్రామానికి చెందిన గోవిందప్ప కుమారుడు కిషోర్‌తో కలిసి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఆస్పరి నుంచి బెల్లందొడ్డికి వెళ్తున్న వీరాంజిని బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. కిషోర్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక కిషోర్ మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ హనుమంతప్ప తెలిపారు.

సంక్షిప్త సమాచారం

సాయుధ బలగాల కవాతు

హొళగుంద, ఏప్రిల్ 5: మండలంలోని పెద్దగోనేహాల్, ఎండీ హళ్లి, గజ్జెహళ్లి, వందవాగిలి గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించాయని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టంగా తెలియజేసిందని, ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పని ఒత్తిడితో అంగన్వాడీ కార్యకర్త మృతి

ఆస్పరి, ఏప్రిల్ 5: అంగన్వాడీ కార్యకర్త పనిఒత్తిడి తాళలేక మృతి చెందినట్లు సీఐటీయూ జిల్లా నాయకుడు హనుమంతు, మండల కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆస్పరిలోని అంగన్వాడీ సెంటర్-2లో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్త జయమ్మ (52) రోజు మాదిరిగానే సెంటర్‌లో విధుల్లో ఉండగానే అనారోగ్యానికి గురైందని, గుర్తించిన స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా వైద్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారన్నారు. అంగన్వాడీలకు సంబంధంలేని అనేక రకాల యాప్‌లను ప్రవేశపెట్టిన ప్రభుత్వ అధికారులు, ఆ పని ఒత్తిడిని తాళలేకనే అనారోగ్యానికి గురై మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్రం పథకాల పేర్లు మార్చిన వైసీపీ ప్రభుత్వం

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 5: కేంద్ర ప్రభుత్వ పథకాలను వైసీపీ ప్రభుత్వం పేర్లు మార్చి తమవిగా చెప్పుకొని పాలన సాగిస్తోందని బీజేపీ ఎమ్మిగనూరు కన్వీనర్ కేఆర్ మురహరి రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీకార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో సీటు వచ్చిన అభ్యర్థి ఎవరైన సరే పొత్తు ధర్మ పాటించాలని సూచించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బీఎల్ నారాయణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓటేయ్యాలి

దేవనకొండ, ఏప్రిల్ 5 : గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటేయ్యాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. పల్లెదొడ్డిలో శుక్రవారం తమ సిబ్బందితో పర్యటించి అనుమానితుల ఇళ్లలను తనిఖీ చేశారు.

రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

మద్దికెర, ఏప్రిల్ 5 : వ్యవసాయ పనులకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు కూలీల కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలుగు యువత తాలుకా ఉపాధ్యక్షుడు ఎన్.చంద్రమోహన్, మండల టీడీపీ ఉపాధ్యక్షులు టైలర్ హరి అన్నారు. ఇంత వరకు అధికారులకు కూడా బాధిత కుటుంబాలను పరామర్శించలేదని పేర్కొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం

గోనెగండ్ల : నిరుపేద కుంటుంబంలో ఉండి అకాల మరణం పొందిన స్నేహితుని కుటుంబానికి పూర్వ విద్యార్థులు బాసటగా నిలిచారు. 2003లో పదోతరగతి పూర్తి చేసుకున్న స్నేహితులు నరసింహుని కుటుంబాన్ని అదుకోవాలని తలచి తమ వంతుగా రూ. 53 వేలను సేకరించి శుక్రవారం నరసింహుని భార్య, కూతురు, కుమారునికి చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుబ్రమాణేశ్వరరావు, ఉన్నతపాఠశాల ఉపాధ్యాయుడు రామన్, పూర్వవిద్యార్థులు రఫీ, రామ్మోహన్, బేతాల హుస్సేన్, షఫీబాషా, మద్దిలేటి, చంద్రశేఖర్, చంద్ర, ఆలీ పాల్గొన్నారు.

ఐదుకు చేరిన మృతుల సంఖ్య

మద్దికెర, ఏప్రిల్ 5 : గ్రామ శివారులో మార్చి 31న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గొడుగు వెంకటేశ్వరమ్మ (55) కోలుకోలేక శుక్రవారం మృతి చెందింది. మార్చి 31న చిప్పగిరి మండలంలో మిరపకాయలు తెంచేందుకు కూలీలు ఆటోలో వెళ్తూ టైరు పేలీ విద్యుత్ స్థంభాన్ని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు వీరిలో ఇప్పటిదాకా ఐదుగురు కూలీలు మృతిచెందారు. ఎస్ఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ శవరాజకీయాలు మానుకోవాలి

కోసిగి, ఏప్రిల్ 5: స్థానిక వైసీపీ నాయకులు శవరాజకీయాలు మానుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు ముత్తురెడ్డి, మండల కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీ తోవి రామక్రిష్ణ, చింతలగేని నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాడిగేని గేరిలో నివాసముంటున్న నాడిగేని ముత్తమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందిందని, అయితే, వైసీపీ నాయకుడు బరంగల్ శ్రీనివాసరెడ్డి పింఛన్ కోసం వెళ్లి వృద్ధురాలు మృతి చెందిందని శవంతో రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాతనూరు కోసిగయ్య, బుజ్జి, శివన్న, చింతకుంట తాయన్న, పాలరాజు, తిక్కారెడ్డి, కోర్వి హనుమప్ప, నర్సన్న ఉన్నారు.

శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం

మంత్రాలయం, ఏప్రిల్ 5 : మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్య పూజలకు విరామం కల్పించారు. శుక్రవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయ కొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠంపీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు ముద్రధారణ చేశారు.

చలివేంద్రం ప్రారంభం

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 5: పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ మాధవరాజు, డీటీ లక్ష్మీనారాయణ, సెంట్రల్ బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామ్మోహన్ పాల్గొన్నారు.